RNI APTEL/25/A0798


# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:29 19-7-2025 శనివారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /

## రెండ్రోజుల్లో అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ : చంద్రబాబు ప్రకటన




(టుడే విదుర): జులై 18: పరిశుభ్ర ఇంధనం కోసం గ్రీన్ హైడ్రోజన్ పై రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతిలో జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం, హైడ్రోజన్ ఉత్పత్తికి అవసరమైన మౌలిక వనరులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.గ్రీన్ హైడ్రోజన్‌ను అందుబాటులోకి తేవాలంటే నూతన సాంకేతికత అవసరమని సీఎం అన్నారు. విశ్వవిద్యాలయాలు, పరిశోధకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇది గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించేందుకు కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం : మంత్రి నారాయణ



అనంతపురం,(టుడే విదుర): జులై 18 : ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నామని ఎపి పురపాలక శాఖామంత్రి నారాయణ ప్రకటించారు. శుక్రవారం ఉదయం అనంతపురంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి నారాయణ ప్రసంగించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఏ ఒక్క హామీ నుంచి వెనక్కి తగ్గడం లేదని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని కొనియాడారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నాం అని ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధి జరిగితేనే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం చెత్తపై పన్ను వేసిందని, కానీ, చెత్త తొలగించలేదు అని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాగానే చెత్తపై పన్ను తొలగించాం అని మంత్రి అన్నారు.




## టీడీపీకి రాజీనామా..
## అశోక్ గజపతిరాజు భావోద్వేగం

(టుడే విదుర): జులై 18: గోవా గవర్నర్‌గా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుని భారత ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి, పోలిట్ బ్యూరో సభ్యత్వానికి అశోక్ గజపతిరాజు రాజీనామా చేశారు. అనంతరం అధికారికంగా టీడీపీ హై కమాండ్‌కి ఈ లేఖను పంపించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు భావోద్వేగానికి గురయ్యారు. ఇన్నేళ్లు టీడీపీలో ఉన్నానని, పార్టీని వీడుతున్నందుకు బాధగా ఉందన్నారు. పార్టీ, నేతలతో ఉన్న మధుర క్షణాలని ఆయన గుర్తు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీకి అశోక్ గజపతిరాజు ఎంతగానో సేవలు అందించారని నేతలు కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ప్రశంసల వర్షం కురిపించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విధాలుగా తనకు న్యాయం చేశారని చెప్పుకొచ్చారు అశోక్ గజపతిరాజు. పసుపు శుభసూచకమని, పసుపుని నమ్ముకున్న వారు ఎవరైనా బాగుంటారని తెలిపారు. కాగా, ఇవాళ(శుక్రవారం) సింహాచలం అప్పన్న స్వామిని కుటుంబ సమేతంగా అశోక్ గజపతిరాజు దర్శించుకున్నారు. ఆయనకు పూర్ణకుంభంతో అర్చక స్వాములు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్ద అశోక్ గజపతిరాజును శాలువాతో మాజీమంత్రి అవంతి శ్రీనివాస్ సత్కరించారు.

## జగన్‌పై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు



విశాఖపట్నం,(టుడే విదుర): జులై 18: తమిళనాడులో పార్టీలు రాజకీయంగా విభేదించినా.. రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పని చేస్తాయని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఇక్కడ మాత్రం స్వార్థ పూరిత ప్రతిపక్ష ఉండటం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, పోలవరం, నీటిపారుదల ప్రాజెక్టుల అంశంలో తప్పిదాలపై ప్రజల దృష్టి మరల్చడానికి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని విమర్శించారు.ఏపీలోని కూటమి ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ.. అబద్దాలే పునాదిగా చేసుకొని పబ్బం గడుపుకునేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి పార్థసారథి అన్నారు. కేవలం రాజకీయలబ్ధి కోసమే ఇదంతా చేస్తున్నారని ఆయన విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 70 శాతం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసినా.. గత జగన్ సర్కారు ప్రాజెక్ట్ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు.జగన్.. ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడు.. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు.. అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి.. ఆ ప్రయోజనాలు రైతన్నలు పొందేలా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. వైఎస్ జగన్ బాధ్యత గల రాజకీయ నాయకుడిగా పనిచేయాలని ఆయన హితవు పలికారు.రప్పా.. రప్పా నరికేస్తా. పొడి చేస్తాం అంటున్నారు.. పోలీసులు సక్రమంగా పనిచేయకూడదని, విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తున్నారు, పోలీసులుపై కించపరిచేలా మాట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు. జగన్.. మీడియాను టిష్యూ పేపర్తో పోల్చారంటే.. మీడియాపై ఆయనకి ఎలాంటి గౌరవం ఉందో చూడండని మంత్రి అన్నారు.

## సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లను అరికట్టేలా చట్టాల్లో మార్పులు: రఘురామకృష్ణంరాజు




అమరావతి, (టుడే విదుర): జులై 18: సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లను అరికట్టే అంశాలపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆధ్వర్యంలో పిటిషన్ కమిటీ ఈరోజు (శుక్రవారం) సమావేశమైంది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ.. సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లను అరికట్టేందుకు పటిష్టమైన చట్టాలు అవసరమన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాన్ని మరింత పదును పెట్టేలా మార్పులు, చేర్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ చట్టానికి సవరణలు చేస్తూ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టేలా కమిటీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చట్ట సవరణ తెచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.సైబర్ నేరాలను అరికట్టగలిగితే బాధితుల డబ్బును ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా అడ్డుకోవచ్చన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో బాధితులు మోసపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్ యాప్‌లు తయారు చేసేవారిపై.. వాటిని ప్రమోట్ చేసే వారిపైనా కేసులు తప్పవని హెచ్చరించారు. సైబర్ క్రైమ్‌ను అరికట్టేందుకు ఐటీ నాలెడ్జ్ ఉన్న పోలీసు యంత్రాంగం అవసరమన్నారు. బాధితులు 1930కి వెంటనే ఫిర్యాదు చేయాలని చెప్పారు. ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు.

సైబర్ చట్టాలకు సవరణ చేస్తాం: పల్లా

సైబర్ నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చట్టం తీసుకువస్తామని టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తెలిపారు. తెలియని లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయరాదని ఆయన చెప్పారు. ఓటీపీలను తెలియని వ్యక్తులకు ఇవ్వరాదన్నారు. సైబర్ చట్టాలు సవరణ చేస్తామని పల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు, గురజాల జగన్ హాజరయ్యారు.

## భాను వ్యాఖ్యలపై రోజా ఆగ్రహం



(టుడే విదుర):జులై 18: నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రంగా స్పందించారు. తనపై అనుచితంగా వ్యాఖ్యానించిన గాలి భాను ప్రకాష్ పై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి ఆమె జాతీయ మహిళా కమిషన్‌తో పాటు, ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్‌కు కూడా అధికారికంగా ఫిర్యాదు చేశారు."రూ. 2 వేలు ఇస్తే రోజా ఏ పని అయినా చేసేది. అలాంటి రోజా ఇప్పుడు రూ. 2 వేల కోట్లను సంపాదించింది" అనే ప్రకటనతో తనపై గాలి భాను మాట్లాడిన తీరును రోజా తీవ్రంగా తప్పు బట్టారు. ఈ వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని హీనంగా చూపించడమే కాకుండా, మహిళల హక్కులపై ) జరిగిన అవమానకరమైన దాడిగా అభివర్ణించారు.భాను ప్రకాష్ తన గురించి "వ్యాంప్‌కు ఎక్కువ, హీరోయిన్‌కు తక్కువ"గా మాట్లాడడంపై రోజా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇది కేవలం వ్యక్తిగత దూషణ మాత్రమే కాదు, ఒక మహిళను హీనంగా చూపించాలన్న కుట్రల సరళిలో భాగమని ఆమె అన్నారు. ఒక మహిళ గురించి ఎవరైనా ఇంత నీచంగా మాట్లాడతారా? అని ప్రశ్నించారు.

## స్థానిక సంస్థల నిధులు వారికే.. ప్రభుత్వం వాడుకోదు: మంత్రి ఆనం



నెల్లూరు, (టుడే విదుర): జులై 18: కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు త్వరలో వస్తున్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులను కేంద్రం పంపనున్నట్లు మంత్రి వెల్లడించారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్థానిక సంస్థల నిధులను వాటికే కేటాయిస్తామని.. గత ప్రభుత్వం లాగా ఆ నిధులను కూటమి ప్రభుత్వం వాడుకోదని స్పష్టం చేశారు. సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు తమ ప్రాంతాలు అభివృద్ధి చేసుకునేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. గతంలో సచివాలయాలు ప్రారంభించి పూర్తి చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను గాడిలో పెట్టడానికి చర్యలు చేపట్టిందన్నారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ఇంటింటికీ వెళ్లి అధికారులు పంపిణీ చేశారని.. వాలెంటరీ వ్యవస్థ లేకుండానే అమలు చేశారని చెప్పుకొచ్చారు. జలజీవన్ మిషన్ కింద రూ.28వేల కోట్లు కేంద్రం ఇస్తామంటే, కనీసం రూ.2వేల కోట్లు కూడా గత ప్రభుత్వం వినియోగించుకోలేదని విమర్శించారు. తల్లికి వందనం కింద నిధులను తల్లి అకౌంట్‌లో జమ చేశామని చెప్పుకొచ్చారు. మంత్రి లోకేష్ చిత్తశుద్ధిగా పథకం అమలు చేసిన తీరును అందరూ అభినందిస్తూ జెడ్పీ మీటింగ్‌లో తీర్మానం చేశామన్నారు. నాడు-నేడులో భాగంగా జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాలల భవనాలను పూర్తి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## మోదీ 75 భగవత్ మాటలో మర్మమేమిటి

మా కాంగ్రెస్‌లో ముఠా కుమ్ములాటలు బహిరంగంగా జరుగుతాయి. ఎటువంటి దాపరికం ఉండదు. భారతీయ జనతా పార్టీలో కలహాలు, కుమ్ములాటలు అన్నీ మూడోవాడి కంటికి కనిపించకుండా గుట్టుగా సంభవిస్తుంటాయి' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు వాపోయారు. బహిరంగ ఆరోపణలు, ప్రత్యారోపణలతో స్వీయ లక్ష్యాలు సాధించుకోలేకపోగా ప్రత్యర్థి పార్టీలకు ప్రయోజనాలు చేకూర్చడమనే ప్రవృత్తి కాంగ్రెస్ నేతలలో మెండుగా కనిపిస్తోంది. కేరళలో శశిథరూర్, పీసీసీ నాయకుల మధ్య వాగ్వాదాలుబీ కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గాల పరస్పర నిందలు అందుకు తాజా నిదర్శనాలు. కాంగ్రెస్‌కు విరుద్ధంగా బీజేపీ, సంఘ్ పరివార్‌లో అధికారానికి, ఆధిపత్యానికి అంతర్గత పోటీలు చాలా చాలా అరుదుగా మాత్రమే ప్రజల దృష్టికి వస్తాయి. కారణమేమిటి? చిన్నపాటి జగడం సైతం మీడియా దృష్టికి వెళ్లకుండా సంఘీయులు, బీజేపీ శ్రేణులు అత్యంత జాగ్రత్త వహించడమేనని చెప్పవచ్చు. ఉత్తరప్రదేశ్ పాలనా వ్యవహారాలలో పెత్తనానికై అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ మధ్య ఎడతెగని పోటీ, బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికలో నెలల తరబడి జాప్యానికి ఆరెస్సెస్, బీజేపీ పెద్దల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం పతాక శీర్షికలుగా కాదు కదా వార్తలుగా కూడా కనిపించడం అరుదే. అంతర్గతంగా జరుగుతోన్న వాదోపవాదాల గురించి ఏమి మాట్లాడితే ఏమి ముప్పు వాటిల్లుతుందో అన్న భయాందోళనలు సంఘ్, బీజేపీ శ్రేణులను కట్టడి చేయడం పరిపాటి.ప్రజా జీవితంలో ఉన్నవారు 75 ఏళ్ల వయస్సు రాగానే బాధ్యతల నుంచి వైదొలగాలని, పదవీ విరమణ చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ సలహా ఇవ్వడం పలువురిని విస్మయపరిచింది, ఎంతో మందిని దిగ్భ్రాంతిపరిచింది, కొంత మందికి కించిత్ అసంతృప్తి కలిగించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో 75వ పుట్టిన రోజు జరుపుకోనున్నారు. అదే నెలలో మోహన్ భగవత్ సైతం 75వ పుట్టిన రోజు జరుపుకోనున్నారు. సంఘ్ అధినేత వ్యాఖ్యలకు ప్రతిపక్షాలు వెన్వెంటనే ఆనందోత్సాహాలతో ప్రతిస్పందించాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారసుడు ఎవరో తక్షణమే నిర్ణయించేందుకు సంఘ్ నాయకత్వం ఆరాటపడుతోందని అనేందుకు భగవత్ వ్యాఖ్యలే తార్కాణమని విపక్షాలు గట్టిగా అభిప్రాయపడుతున్నాయి. 'మోదీ తరువాత, ఎవరు?' దశాబ్దాల క్రితం నాటి 'నెహ్రూ తరువాత, ఎవరు?' అన్న చర్చను జ్ఞాపకం చేస్తోంది. మోదీ తరువాత ఎవరు అన్నది చాలా ఆసక్తికరమైన విషయం, సందేహం లేదు. చర్చలు మొదలయ్యాయి, ముమ్మరమయ్యాయి. అయితే వాస్తవాన్ని పరిశీలిస్తే వాద్‌నగర్ నుంచి ప్రభవించిన వ్యక్తి చాలా మంది ఆశిస్తున్నట్టుగా చాలా తొందరగా ఆ ప్రతిష్ఠాత్మక పదవి నుంచి వెళ్లిపోతారా? పోరు, కచ్చితంగా. 2024 సార్వత్రక ఎన్నికలపై నేను రాసిన పుస్తకంలో పేర్కొన్న ఒక ఆసక్తికరమైన ఉదంతాన్ని ఇక్కడ కూడా ప్రస్తావిస్తాను. ఆరు నూరైనా సరే అధికారంలో కొనసాగడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తారనేది ఆ ఉదంతం విశదం చేస్తుంది. నవ యువకుడిగా ఉన్నప్పుడు మోదీ అహ్మదాబాద్‌లో తన బాబాయి టీ స్టాల్‌లో కొంతకాలం పనిచేశారు. వాద్‌నగర్ నుంచి అహ్మదాబాద్‌కు రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులో వెళుతుండేవారు. అదే బస్సులో తిరిగి వాద్‌నగర్‌కు వెళ్లేవారు.. అహ్మదాబాద్ చేరగానే తిరిగి వెళ్లేందుకు సీటు రిజర్వేషన్‌కై తన బ్యాగ్‌ను బస్సులోనే వదిలివేసేవారట! ఈ కథ నుంచి తెలుసుకోవల్సిన విషయమేమిటి? మోదీ ఒకసారి ఒక కుర్చీలో కూర్చుంటే దాన్ని మరెవరూ ఆయన నుంచి లాక్కోలేరు! గుజరాత్ కాంగ్రెస్ నాయకుడు ఒకరు ఈ ఆసక్తికరమైన కథను నాకు చెప్పారు. నిజం కావచ్చు, కాకపోవచ్చు.

అయితే దానిలో అంతర్లీనంగా ఉన్న సందేశమిది: అధికారం చెలాయించడం, పెత్తనం చేయడం మోదీ సహజ స్వభావం. తన భవిష్యత్తుపై తనకు పూర్తి నియంత్రణ లేకపోవడమనేది ఆయనకు సుతరామూ నచ్చని విషయం. అటువంటి నాయకులు పదవీ విరమణ చేయడం కాదు కదా అప్రధానంగా ఉండడానికి కూడా ఏ మాత్రం ఇష్టపడరు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులు ఏ విషయం పైన అయినా ఆచితూచి మాట్లాడుతారు. మరి మోహన్ భగవత్ హఠాత్తుగా పదవీ విరమణకు 75 సంవత్సరాల వయస్సు గురించి ఎందుకు ప్రస్తావించారు? సంఘ్‌లో ఒక వర్గంవారు బీజేపీలో తరం మార్పును కోరుకుంటున్నారని అధికార నడవాలలో గుసగుసలు గట్టిగా విన్పిస్తున్నాయి. బీజేపీ, ఆరెస్సెస్ నాయకత్వాల మధ్య గుంజాటన 2024 సార్వత్రక ఎన్నికల సందర్భంలో బహిర్గతమయింది. ఆరెస్సెస్ మద్దతు తప్పనిసరిగా అవసరమైన నాటి కాలం నుంచి బీజేపీ ఇప్పుడు బాగా ఎదిగిందని, తన వ్యవహారాలను తానే బాగా చక్కదిద్దుకోగల శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా సంతరించుకున్నదని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఒక జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. నడ్డా వ్యాఖ్యలు సంఘ్ పరివార్ నాయకత్వ శ్రేణుల్లో ఆందోళనను రేకెత్తించాయి. మోదీ ఆరాధన కేంద్రంగా పెంపొందిన రాజకీయ పరిస్థితుల పట్ల ఆరెస్సెస్ నాయకత్వంలో నెలకొన్న అసంతృప్తి, చిరాకును ఆ ఆందోళన ప్రతిబింబించింది. పెచ్చరిల్లిపోతున్న మోదీ వ్యక్తిపూజ పట్ల మోహన్ భగవత్ తన ఆవేదనను గత సెప్టెంబర్‌లో వెలువరించిన ఒక ఉపన్యాసంలో ఇలా వ్యక్తం చేశారు: 'ప్రజాహిత కృషి ద్వారా ప్రతి ఒక్కరూ గౌరవాదరాలు పొందవచ్చు. అయితే మనం అటువంటి సమున్నత స్థితికి చేరామా లేదా అన్నది నిర్ణయించవలసింది ఇతరులే కాని మనకు మనమే కాదు. ఎవరైనా సరే తనకు తానుగా భగవంతుడనని ఎట్టి పరిస్థితులలోను ప్రకటించుకోకూడదు'.

## తెలుగు రాష్ట్రాలకు ఐఎమ్‌డీ హెచ్చరిక..
## వారం రోజులు భారీ వర్షాలు..




జూలై 18 (టుడే విదుర): తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా నిన్న భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. మరో వారం రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలోనే రెండు రాష్ట్రాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అంతేకాదు.. రానున్న ఐదు రోజుల పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అంది. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నేడు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.తెలంగాణలోని 8 జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.

## ఎయిమ్స్‌లో పీఐసీయూ,ఎన్ఐసీయూ సేవలు ప్రారంభం



మంగళగిరి సిటీ, జూలై 18 (టుడే విదుర):మంగళగిరి ఎయిమ్స్‌లో పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ), నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లను ప్రారంభించారు. ఇన్ పేషెంట్ బ్లాకులోని మూడో అంతస్థులో ఏర్పాటు చేసిన ఈ కాంప్లెక్సును ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో అహంతెం శాంతాసింగ్ లాంఛనంగా ప్రారంభించారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో కూడిన పీఐసీయూ, ఎన్ఐసీయూ సేవలు పిల్లలకు మెరుగైన వైద్యం అందించేందుకు దోహదం చేస్తాయని ఆయన చెప్పారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న నవజాత శిశువులు, చిన్నారులకు 24 గంటలూ అత్యవసర వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# అత్యున్నత వైద్య సేవా సంస్థగా స్విమ్స్

### %తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం: టీటీడీ చైర్మన్
### రూ.22.01 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందజేసిన ఐవోసీఎల్




తిరుపతి(వైద్యం), జూలై 18 (టుడే విదుర): దేశంలోనే పేదలకు అత్యున్నతమైన వైద్యసేవలు అందించే వైద్య సేవా సంస్థగా స్విమ్స్‌ను తీర్చిదిద్దేందుకు టీటీడీ కృషి చేస్తుందని బీఆర్‌నాయుడు తెలిపారు. తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్) రూ. 22.01 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందజేసింది. అధునాతన ఎంఆర్ఐ స్కానర్, 4డీ సీటీ సిమ్యులేటర్ సిస్టంలను ఐవోసీఎల్ ప్రతినిధులతో కలిసి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. ఇప్పటికే ఏటా రూ. 140 కోట్లను స్విమ్స్ అభివృద్ధికి, రోగులకు మెరుగైన వైద్య సేవలకు టీటీడీ అందిస్తోందని ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఐవోసీఎల్ రూ. 14 కోట్ల విలువైన టెస్లా ఎమ్ఆర్ఐ స్కానర్‌ను, మరో రూ. 8 కోట్లతో 4డి సీటీ సిమ్యులేటర్ సిస్టంను అందించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్విమ్స్‌కు ఈ వైద్య పరికరాలను అందించినట్లు ఐవోసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ సతీషకుమార్ తెలిపారు.

# ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

### తల గోడకు కొట్టుకుని పడిపోయాడంటూ నాటకం
### పోలీసుల రంగప్రవేశంతో తామే చంపామని వెల్లడి
### నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలో దారుణం



రాపూరు, జూలై 18 (టుడే విదుర): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తనే హతమార్చింది ఓ ఇల్లాలు. మద్యం మత్తులో నిద్రపోతున్న భర్తను అర్ధరాత్రి కాళ్లూచేతులు కట్టేసి, మెడకు కరెంటు వైరు బిగించి కిరాతకంగా కడతేర్చింది. అనంతరం తన భర్త తాగొచ్చి తనతో గొడవపడి, తల గోడకు కొట్టుకుని పడిపోయాడంటూ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే చెవుల నుంచి రక్తం కారడం, మెడ కమిలిపోయి ఉండడంతో మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రాపూరులోని దళితవాడకు చెందిన లేబాకు రత్నయ్య, రమణమ్మ దంపతుల కుమారుడు లేబాకు శీనయ్య (28)కు పంగిలి గ్రామానికి చెందిన ధనమ్మతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల పాప కూడా ఉంది. రత్నయ్య దంపతులు, శీనయ్య పక్కపక్కనే వేర్వేరు ఇళ్లలో ఉంటున్నారు. కూలి పనులు చేసుకునే శీనయ్య మద్యం మత్తులో తరచూ ధనమ్మతో గొడవపడేవాడని స్థానికులు తెలిపారు. రోజూలాగే కూలి పనులు ముగించుకొని ఇంటికొచ్చిన శీనయ్య రాత్రి నిద్రపోయాడు. ఉదయం ఆయన నిద్ర లేవకపోయేసరికి ధనమ్మ పక్క ఇంట్లో ఉన్న అత్తామామల వద్దకు వెళ్లి శీనయ్య లేవడం లేదని చెప్పింది.రాత్రి తనతో గొడవపడ్డాడని, తల గోడకు కొట్టుకొని పడిపోయాడని నమ్మబలికింది. వెంటనే లోపలికి వెళ్లి చూసిన తల్లిదండ్రులు అప్పటికే శీనయ్య మృతిచెందినట్టు గమనించారు. అతని మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చి మంచంపై పడుకోబెట్టారు. అయితే శీనయ్య చెవి నుంచి రక్తం కారడం, మెడపై నల్లగా కమిలినట్లు ఉండటాన్ని గమనించిన తల్లిదండ్రులు, కొంతమంది బంధువులు ధనమ్మను ప్రశ్నించారు. అయితే ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పేసరికి వారికి అనుమానం వచ్చింది. దీంతో వారు రాపూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ధనమ్మను గద్దించి అడగడంతో జరిగిన విజయం బయటపెట్టింది. తనతో సాన్నిహితంగా ఉన్న కల్యాణ్ అలియాస్ వెంకటరమణయ్యతో కలిసి శీనయ్యను హత్యచేసినట్టు అంగీకరించింది. తాము ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం బుధవారం అర్ధరాత్రి పడుకుని ఉన్న శీనయ్య కాళ్లూచేతులూ కట్టేసి కరెంట్ వైర్‌తో గొంతు బిగించి ఊపిరాడకుండా చేసి చంపేశామని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. నిందితురాలు చెప్పిన వివరాల ప్రకారం కల్యాణ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# వృద్ధురాలి ఖాతాలో 2.15 లక్షలు మాయం

## విడతల వారీగా కొట్టేసిన సైబర్ మోసగాళ్లు!

## మీ సేవలో చలానా తీసి.. ఫిర్యాదు చేయాలన్న సైబర్ క్రైం

దేవనకొండ, జూలై 18 (టుడే విదుర):తన బ్యాంకు ఖాతాలోని రూ. 2.15 లక్షలు మాయమైనట్లు కర్నూలు జిల్లా దేవనకొండ మండలం తెర్నేకల్లుకు చెందిన శాలు బీ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. శాలు బీ అనే వృద్ధురాలికి గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. ఆ ఖాతాకు ఆమె కుమారుడు మాబుసుభాన్ ఫోన్ నంబరు లింక్ చేశారు. గత నెలలో ఎల్ఐసీ డబ్బులు 59 వేలు, పొదుపు సంఘం రుణం 1.50 లక్షలు ఆమె ఖాతాకు జమయ్యాయి. ఈ నెల 7న ఆమె కుమారుడి సెల్ నంబరు బ్లాక్ అయింది. 8వ తేదీన ఆమె ఖాతా నుంచి రూ.49 వేల చొప్పున రెండు సార్లు, 9వ తేదీన రూ.49 వేల చొప్పున రెండు సార్లు డబ్బులు కట్ అయ్యాయి. ఆతర్వాత పలు విడతల్లో మిగతా నగదు కట్ అయింది. మాబుసుభాన్ కొత్తసిమ్ తీసుకోవడానికి ప్రయత్నించగా సైబర్ మోసగాళ్లు ఆధార్ నంబరును లాక్ చేశారు. 14వ తేదీన అదే నంబర్‌పై కొత్త సిమ్ తీసుకున్నారు. బ్యాంకు ఖాతాలో నగదు కట్ అయినట్లు 15వ తేదీ నుంచి మెసేజ్‌లు వచ్చాయి. దీంతో బాధితురాలు కర్నూలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించగా మీసేవలో చలానా చెల్లించి దేవనకొండ పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారని బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపారు. మీ సేవలో సర్వర్ సమస్య ఉందని, శుక్రవారం చలానా చెల్లిస్తామని చెప్పారు.

# పాఠశాల విద్య బలోపేతానికి అకడమిక్ ఫోరంలు



అమరావతి,జూలై 18 (టుడే విదుర): పాఠశాల విద్య బలోపేతానికి అకడమిక్ ఫోరంలు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వీటి ఏర్పాటుకు ఆదేశాలు జారీచేసింది. అకడమిక్ అంశాల్లో మార్గనిర్దేశనం, సామర్థ్యాల పెంపు, అభ్యసన ఫలితాల మెరుగుదలకు జవాబుదారీతనం తదితర అంశాలను ఇవి పర్యవేక్షించనున్నాయి. రాష్ట్రస్థాయి ఫోరానికి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ చైర్‌పర్సన్‌గా, ఎస్‌సీఈఆర్‌టీ, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్లు, కేజీబీవీ కార్యదర్శి, ఇతర అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ ఫోరం వ్యూహాత్మక దిశానిర్దేశం, అకడమిక్ గైడెన్స్ అంశాలను పర్యవేక్షిస్తుంది. జిల్లా ఫోరంలో డీఈవో చైర్‌పర్సన్‌గా, సమగ్రశిక్ష ఏపీసీ, డైట్ ప్రిన్సిపాల్, డీసీఈబీ కార్యదర్శి, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఇతర అధికారులు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయి బృందాలను సమన్వయం చేస్తూ అకడమిక్ అంశాల్లో ఈ కమిటీలు సూచనలు చేస్తాయి. ఇక మండల స్థాయి ఫోరానికి ఎంఈవో-1 చైర్‌పర్సన్‌గా, ఎంఈవో-2, క్లస్టర్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ టీచర్లు సభ్యులుగా ఉంటారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, నకిలీ నమోదుల తొలగింపు, విద్యార్థి వరుసగా గైర్హాజరైతే ఇంటికి వెళ్లి ఆరా తీయడం వంటి బాధ్యతలను కూడా ఈ ఫోరాలు పర్యవేక్షించాలి.

# విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా విధి వక్రించింది




బొబ్బిలి, జూలై 18 (టుడే విదుర):విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా విధి వక్రించింది. ఇంటికెళ్లి తల్లిలేని తన కుమార్తెతో మాటా మంతీ ఆడుకుని విశ్రాంతి తీసుకుందామనుకున్న ఆ యువకుడిని మృత్యువు కబళించింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక గ్రోత్ సెంటర్‌లోని బెర్రీ కంపెనీలో జేసీబీ ఆపరేటర్‌గా సత్యనారాయణ చేస్తున్నాడు. అత డు మల్లమ్మపేటలో నివాసముంటున్నాడు. రాత్రి డ్యూటీ ముగించుకుని బైక్‌పై గ్రోత్ సెంటర్ నుంచి పట్టణానికి వస్తుండగా లారీ ఢీకొంది. ప్రమాదంలో సత్యనారాయణ తీవ్ర గాయాల పాలయ్యాడు. కుడి కాలు నుజ్జయిపోయింది. ఎడమ కాలు విరిగిపోయింది. తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలిస్తుం డగా మార్గమధ్యంలో సత్యనారాయణ మృతిచెందాడు. సీఐ సతీష్‌కుమా ర్ ఆధ్వర్యంలో ఎఎస్ఐ స్వామి కేసు నమోదు చేశారు. మృతదేహానికి బొబ్బిలి సీహెచ్‌సీలో పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. మృతిచెందిన సత్యనారాయణ మన్యం జిల్లా బలిజిపేట మండలం అరసాడ గ్రామస్థుడు. అతడి భార్య నాగమణి ఏడాదిన్నర క్రితం చనిపోయింది. తొమ్మిది సంవత్సరాల వయస్సు కలిగిన కుమార్తె జ్యోషిణి ఉంది. జేజీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం పట్ల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులు సూర్యనారాయణ, పార్వతి, అన్న వెంకటరమణ ఉన్నారు.

# యువతిపై వేధింపులకు పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు

విజయనగరం క్రైం, జూలై 18 (టుడే విదుర): యువతిపై వేధింపులకు పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి ఏడాది సాధారణ జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఏడీజే కోర్టు న్యాయాధికారి ఎన్.పద్మావతి తీర్పు వెల్లడించినట్లుగా విజయనగరం మహిళా పీఎస్ డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లాకు చెందిన ముప్పాల అశ్విన్ నెలిమర్ల మిమ్స్ కళాశాలలో 2023 సంవత్సరం లో చదువుతున్న సమయంలో అదే కళాశాలలో చదువుతున్న ఒక యువతితో పరిచయం ఏర్పరుచుకుని వివిధ సందర్భాల్లో ఆమెను వేధించాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి మహిళా పీఎస్ ఎస్ఐ పద్మావతి కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం




దాఖలు చేశారు. కోర్టు విచారణలో అశ్విన్‌రెడ్డి వేధింపులకు పాల్పడినట్లుగా రుజువు కావడంతో ఈ శిక్ష విధించారు. ఈ కేసులో పోలీసువారి తరపున ఏపీపీ ఎన్.శకుంతల వాదనలు వినిపించగా, అప్పటి ఎస్ఐ ఎన్.పద్మావతి కేసును దర్యాప్తు చేశారు. కోర్టు కానిస్టేబుల్ జి.సూరపునాయుడు, సీఎంఎస్ మహిళా కానిస్టేబుల్ సీహెచ్ సౌజన్య సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు.

# గంజాయి అక్రమ రవాణాలో ఒకరు అరెస్ట్



తిరుపతి సిటీ :జూలై 18 (టుడే విదుర): గంజాయి అక్రమ రవాణాలో ఒకరు అరెస్టయ్యారు. నిందితుడి వద్ద నుండి 6 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాలో సంబంధం ఉన్న ఇద్దరి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. శుక్రవారం చింతల చేను రైల్వే గేట్ సమీపంలో నిందితుడు పట్టుబడ్డాడు. ప్రకాశం జిల్లా, పామూరు మండలానికి చెందిన కదంబూరు రమేష్ గా గుర్తించారు. గంజాయి సరఫరాలో ఒడిశా రాష్ట్రానికి చెందిన గోపాల్, చెన్నైకి చెందిన అభి అనే వ్యక్తులు ప్రధాన పాత్రధారులుగా ఈస్ట్ పోలీసులు నిర్ధారించారు. పట్టుపడ్డ ముద్దాయిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

# కోతకు గురవుతున్న రహదారులు పట్టించుకోని అధికారులు



చల్లపల్లి (కృష్ణా) జూలై 18 (టుడే విదుర): అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆర్ అండ్ బి రహదారులు కోత గురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. చల్లపల్లి నుండి శ్రీకాకుళం ఆర్ అండ్ బి రహదారి లో వెలివోలు సమీపంలో కోత కు గురై సంవత్సర కాలమైన నేటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై సంబంధం అధికారులపై ఆ ఆ ప్రాంత రైతులు మండిపడుతున్నారు. ఈ వ్యవసాయ సీజన్లో రహదారి పక్కనే పంట కాలువ ప్రవాహం ఎక్కువగా ఉండటం వలన రహదారి కోత పెరిగే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు కోత కు గురవుతూ కుంచించి పోతున్న రహదారికి మధుమతులు చేసి ప్రమాదాల నివారించాలని ఆ ప్రాంత ప్రజలు సంబంధిత కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి కోత మోటార్ వాహనాలకు ప్రమాద సూచక మారింది. ఘంటసాల మండలం శ్రీకాకుళం, పాప వినాశనం,గోగినేని పాలెం గ్రామాల నుండి చల్లపల్లిలోని పాఠశాల, కళాశాలలకు, వైద్యశాలలకు వెళ్లేందుకు ఇదే రహదారి ప్రధాన రహదారి. నిత్యం పాఠశాల బస్సులు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రవాణా వాహనాలు ఈ రహదారి వెంటే పరుగులు తీస్తాయి. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 108, ఆటోలు సైతం పయనిస్తాయి. నిమ్మగడ్డ,వెలివోలు పొలిమేరలో కోతకు గురైన రహదారిలో ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు పంచాయతీ పాలకులు తగిన శ్రద్ధ తీసుకొని మరమ్మతులు చేయించాలని రైతుల కోరుతున్నారు.

# తిరుపతిలో కల్వర్టు వద్ద తాపీగా కూర్చున్న చిరుత

తిరుపతి, జూలై 18 (టుడే విదుర): తిరుపతిలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. అలిపిరి - జూపార్క్ రోడ్డులో చిరుత సంచరిస్తోంది. ఈరోజు తెల్లవారుజామున 5:30 గంటల ప్రాంతంలో కల్వర్టు వద్ద చిరుత కనిపించింది. అటవీశాఖ ఏర్పాటు చేసిన ఇనువ కంచె దాటుకుని మరీ చిరుత రోడ్డుపైకి వచ్చింది. రోడ్డుపై చిరుత ఉండటాన్ని చూసిన వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీంతో చిరుత ఉన్న వైపుకు కాకుండా ఒకే



రోడ్డుపై మాత్రమే వాహనదారులు రాకపోకలు సాగించారు. చాలా సేపటి వరకు కూడా చిరుత ఆ ప్రాంతంలోనే తాపీగా కూర్చున్నట్లు సమాచారం. మరోవైపు కొందరు వాహనదారులు చిరుతను తమ మొబైల్‌లో చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్‌గా మారాయి.

## పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించండి : విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన



రాజవొమ్మంగి (అల్లూరి) జూలై 18 (టుడే విదుర): మండలంలోని అనంతగిరి గిరిజన ప్రాథమిక పాఠశాలలో తక్షణం ఉపాధ్యాయులను నియమించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు 32 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే గత రెండు సంవత్సరాల నుండి కేవలం ఒక్క సిఆర్టి తోనే పాఠశాల నడుస్తుందని ఉపాధ్యాయులు ఎవరు పాఠశాలకి రావడంలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సొంత గ్రామం అయినప్పటికీ ఇక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయలు లేకపోవడంతో పలువురు విస్మయానికి గురవుతున్నారు. పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు నియమించాలని పలుమార్లు విద్యాశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం లేకపోయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలను బడికి పంపాలో లేదో అయోమయ పరిస్థితిలో ఉన్నామని, విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలకు సంబంధించి ఉన్న సిఆర్టి అత్యవసర సమయంలోను, శిక్షణ ఉన్న, వ్యక్తిగత అవసరాలుకు సెలవు పెట్టిన, పాఠశాలను మూసివేసే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ నేపథ్యంలో తక్షణం ఈ పాఠశాలకు ఇద్దరు రెగ్యులేరు ఉపాధ్యాయులను నియమించాలని లేదా, మరొక రెగ్యులర్ ఉపాధ్యాయుడైన తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఒంగోలు లో దొంగలు హల్‌చల్

**బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు**

**%రూ.8 లక్షలు విలువైన సొత్తు అపహరణ**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఒంగోలు డీఎస్పీ**



ఒంగోలు క్రైం, జూలై 18 (టుడే విదుర): తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు హల్‌చల్ చేశారు. రాత్రి ఒంగోలు నగరంలోని రాజీవ్‌నగర్‌లో నాలుగు ఇళ్లలో దొంగలు చోరీలకు పాల్పడి సుమారు రూ.8 లక్షలు విలువైన సొత్తును అపహరించుకెళ్లారు. ఒకే ప్రాంతంలో నాలుగు ఇళ్ల తాళాలు పగులు కొట్టి సొత్తు చోరీ చేయడం గమనార్హం. ఈ చోరీలకు పాల్పడింది ఒకే ముఠానా లేకా వేరువేరుగా ఉన్నారా అనేది సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.స్థానిక రాజీవ్‌నగర్ బ్రాహ్మణ వృద్ధాశ్రమానికి సంబంధించిన గదులలో అద్దెకు విప్పర్ల రాజ్యం కుటుంబం ఉంటోంది.రాత్రి పడుకునే సమయంలో ఇంటికి తాళం వేసి బిల్డింగ్ పైన పడుకున్నారు. ఉదయం 4.30 నిద్ర లేచిచూడగా ఇంటి తాళం పగులకొట్టి ఉంది. బీరువా తలుపు పెకిలించి ఉంది. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, రెండున్నర సవర బంగారం ఆభరణాలు, 100 గ్రాముల వెండి అపహరించుకెళ్లారు. సుమారు రూ.2.5 లక్షల విలువైన సొత్తు అపహరించుకెళ్లారు.రాజీవ్‌నగర్ ప్రాంతంలో మోదేపల్లి శ్రీనివాసులు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. ఉదయం చూసే సరికి ఇంట్లో దొంగలు తాళం పగుల కొట్టి చొరబడి రూ.20 వేలు నగదు, రెండున్నర సవర్ల బంగారు ఆభరణాలు, మూడుకిలోల వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. సుమారు రూ 3.5 లక్షల విలువైన సొత్తును చోరీ చేశారు.నాలుగుఇళ్లలో సుమారు రూ.8 లక్షలు సొత్తు అపహరణకు గురైనట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ఈ మేరకు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయకృష్ణ, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ చెప్పారు.స్థానిక దిబ్బలరోడ్డులోని పిండిమర సమీపంలో దగ్గుబాటి వెంకటసుబ్బారావు ఇంట్లో భారీ చోరీ జరిగింది. సుమారు రూ.25లక్షల విలువైన బంగారు సొత్తును దొంగలు అపహరిచుకెళ్లారు. వెంకటసుబ్బయ్య ప్రస్తుతం వీగ్రాండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారు. ఈనెల 12న తన కుటుంబసభ్యులతో కలసి స్వగ్రామం పోరుమామిళ్ల వెళ్లారు. ఉదయం వారు ఇంటికి బయిలుదేరారు. అదేసమయంలో ఇంటి పక్కన ఉన్న వారు తలుపులు తెరిచి ఉన్నాయని ఫోన్ ద్వారా వెంకటసుబ్బయ్యకు తెలిపారు. దీంతో వారు గురువారం మధ్యాహం వచ్చి చూసే సరికి ఇంటితాళం పెకిలించి ఉంది. బీరువా తాళం పగలగొట్టి సుమారు 225 గ్రాములు బంగారం ఆభరణాలు, రూ.1.85 లక్షలు నగదును దుండగులు చోరీ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని తాలుకా సీఐ విజయకృష్ణ, తన సిబ్బందితో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చెరువులను చెత్తకుప్పల్లా చేస్తారా?



పొదిలి :జూలై 18 (టుడే విదుర): రాష్ట్రంలో మంచినీటి చెరువులను చెత్త కుప్పల మారుస్తున్న టిడిపి ప్రభుత్వం ప్రజల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల అన్నారు. సాయంత్రం స్థానిక పొదిలి పెద్ద చెరువు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదిలి పెద్ద చెరువుకు సాగర్ జలాలు మళ్లించేందుకు ఉద్దేశించిన పథకం ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన టిడిపి ప్రభుత్వం దాన్ని పట్టించుకోవడం లేదన్నారు. మంచినీటి చెరువులను నగర పంచాయతీ చెత్తతో నింపడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో చేపట్టిన పలు ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. మార్కాపురంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయగా దానిని టిడిపి ప్రభుత్వం పూర్తి చేయకుండా ప్రైవేట్ వారికి అప్పగించే కుట్ర జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కెవి రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, వై వెంకటేశ్వరరావు, కల్లం సుబ్బారెడ్డి, షేక్ మస్తాన్‌వలి, జి శీను, గుజ్జుల రమణారెడ్డి, రబ్బాని, గుంటూరు పిచ్చిరెడ్డి నారాయణరెడ్డి, నాగిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, నగర పంచాయతీ నాయకులు, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# రహదారి పునర్నిర్మాణానికి శంకుస్థాపన



యర్రగొండపాలెం జూలై 18 (టుడే విదుర): యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు వరకు కలుపుతూ వెళ్లే ప్రధాన రహదారి పలు సంవత్సరాలుగా అత్యంత అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తేమతో, గుంతలతో, మట్టి కందులతో నిండిపోయిన ఈ రహదారిపై కాలినడకన పోవడమే పెద్ద సమస్యగా మారింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దుర్భరంగా మారుతుండటంతో ప్రజలు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినప్పటికీ గతి లేకుం డా పోయింది. ఈ నేపథ్యంలో టీడీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి పునర్నిర్మాణానికి రూ.2.85 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో ఆయన రోడ్డు పునర్నిర్మాణానికి భూమిపూజ చేశారు. శంకుస్థాపన అనంతరం స్వయంగా ప్రొక్లెయినర్ ఎక్కి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను, మండల కేంద్రాలను కలుపుతూ వెళ్లే ఈ రహదారి చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. ప్రజలు పడుతున్న బాధలు కళ్లతో చూసిన తరువాత వెంటనే నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. త్వరలోనే ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా మార్గాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఆర్అండ్‌బి డీఈ గణేష్, ఏఈ షబ్బీర్, కాంట్రాక్టర్ సూర్యం, పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షులు పయ్యావుల ప్రసాద్, టిడిపి నాయకులు చెవుల అంజయ్య, మంత్రు నాయక్, శనగా నారాయణరెడ్డి, వేగినాటి శ్రీనివాస్, కంచర్ల సత్యనారాయణ గౌడ్, షేక్ మస్తాన్‌వలి, వెంకటేశ్వర్లు గౌడ్, కొత్తమాసు సుబ్రమణ్యం, హనుమంతరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు కొనడం లేదని దహనం



రెంటచింతలజూలై 18 (టుడే విదుర): వందల ఎకరాల్లో పొగాకును సాగు చేసి, రూ.లక్షలు పెట్టుబడులు పెట్టగా ఇప్పుడు పొగాకును కొనడంలేదని మండలంలోని గోలి గ్రామం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లబర్లీ పొగాకును దహనం చేసి నిరసన తెలిపారు. రైతులు పత్తి, మిర్చికి ప్రత్యామ్నాయంగా గతేడాది పొగాకును సాగు చేశారు. మిట్టగుడిపాడు, గోలి, పసర్లపాడు, తుమృకోట తదితర గ్రామాల్లో 40 ఏళ్ల తర్వాత సుమారు 170 ఎకరాల్లో సాగు చేశారు. రైతుల నుండి పొగాకును క్వింటాళ్ రూ.15 వేలకు కొనేలా బయ్యర్లు బాండ్లను ఇచ్చారు. మొదట కొంత పొగాకును ఎండబెట్టి పేరేచర్ల, చిలకలూరిపేటకు తీసుకువెళ్లి విక్రయించగా వివిధ రకాల సాకులు చెప్పి క్వింటాళ్‌కు రూ.9 వేలే ఇచ్చారు. కనీసం బాండ్లు ఇచ్చిన బయ్యర్లయినా కొంటారనుకుంటే వారూ గ్రామాలవైపు కన్నెత్తి చూడ్డం లేదు. ఫోన్లు చేసినా స్పందించడం లేదు. తన వద్ద 18 క్వింటాళ్ల పొగాకు ఉందని, ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా పెట్టుబడుల కోసం డబ్బుల్లేవని గోలి గ్రామానికి చెందిన ఆదిమల్ల మణికంఠ, శివశంకర్ వాపోయారు.

# సమస్యల సుడిలో ఆశా వర్కర్లు



కాకినాడ జూలై 18 (టుడే విదుర):ఏ ప్రభుత్వం మారినా ఆశ వర్కర్ల సమస్యలు మాత్రం తీరడం లేదు. ఏళ్లు తరబడి అపరిష్కతంగానే మిగిలిపోతున్నాయి. అధికారంలోకి రావడం కోసం అన్ని వర్గాలకూ ఇచ్చినట్టుగానే ఆశాల న్యాయమైన డిమాండ్ల కోసం కూడా పాలకులు అనేక వాగ్దానాలు చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధి కనబరచడం లేదు. నిరంతరం విధులు నిర్వర్తిస్తున్న ఆశా వర్కర్లను ధరల భారం తీవ్రంగా వెంటాడుతోంది. కుటుంబాలను పోషించుకునేందుకు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత వైసిపి మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా నిరుద్యోగులకు ప్రభుత్వ పథకాలను దూరం చేస్తోంది. ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తుంది.అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న వైనంకాకినాడ, తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3,200 మంది ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని, రాజకీయ వేధింపులు నిలుపుదల చేయించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని తదితర అనేక డిమాండ్లతో అనేకసార్లు ఆందోళనలు నిర్వహిస్తున్నారు ప్రభుత్వానికి విజ్ఞాపనలు అందిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో గతేడాది ఫిబ్రవరిలో రాష్ట్రస్థాయి అధికారులతో చర్చలు జరిగాయి. ఆశలు అడుగుతున్నా న్యాయమైన డిమాండ్లపై ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైసిపి అధికారం కోల్పోయింది. దీంతో హామీలన్నీ పక్కకు పోయాయి. తాము అధికారంలోకి వస్తే ఆశాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని కూటమి నేతలు చెప్పుకొచ్చారు. వాటిపై కూడా ఆశలు వదులుకోవాల్సిందేనా అంటూ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పప్పులు, బియ్యం, కూరగాయలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు విద్యుత్, రవాణా ఛార్జీలు, చెత్త పన్ను అంటూ ఇలా గత ప్రభుత్వం పేదలపై అనేక భారాలను మోపింది. అందులో ఆశా వర్కర్లు కూడా ఉన్నారు. మరో వైపు ఇటీవల నిత్యావసరాల సరుకుల ధరలు పైపైకి ఎగబాగుతున్నాయి. దీంతో ప్రస్తుతం ఇచ్చే అరకొర వేతనం నెలలో పది రోజులకు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే దుస్థితికి చేరారు.సంక్షేమానికి ఎసరుగత ప్రభుత్వం మాదిరిగా తమ ప్రభుత్వం కూడా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ఆశాలకు కూడా వీటిని వర్తింపచేస్తామని హామీ ఇచ్చారు. కూటమి సర్కార్ సైతం సంక్షేమానికి పూర్తిగా ఎసరు పెట్టిందని వర్కర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రామారెడ్డిలో సంచరిస్తున్న పులి..
## భయాందోళనల్లో ప్రజలు



కామారెడ్డిజూలై 18 (టుడే విదుర): కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గోకుల్‌తండా అటవీ ప్రాంతంలో పులి సంచారం కలకలం సృష్టించింది. అటవీ ప్రాంతంలో ఆవులపై దాడిచేసింది. గుర్తించిన తండావాసులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో పులి జాడకోసం 5 రోజులుగా గాలిస్తున్నారు. స్కూల్ తండా, బట్ట తండా, జగదాంబ తండా ప్రాంతాల్లో పులి జాడ కోసం అటవీ సిబ్బంది వెతుకున్నారు. ఈ నేపథ్యంలో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ ఒంటరిగా బటకు వెళ్లకూడదని సూచించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పెద్ద పులుల సంఖ్య పెరిగినట్టు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి వెల్లడించారు. నిరుడు 33 పులులు ఉండగా ఈ సారి వాటి సంఖ్య 36కు చేరినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. పులుల లెక్కింపునకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించినట్టు తెలిపారు. నిరుడు డిసెంబర్ 20నుంచి ఈ ఏడాది మే15 వరకు కెమెరా ట్రాకింగ్ కోసం రిజర్వ్ ఫారెస్టును నాలుగు బ్లాకులుగా విభజించి.. ఒక్కో బ్లాక్‌లో 250 నుంచి 300 కెమెరాలను బిగించినట్టు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా డేటాను సేకరించి పులుల వివరాలను నమోదు చేసినట్టు పేర్కొన్నారు. మొత్తం 36 పులులు ఉండగా, వాటిలో 13మగ, 20ఆడ పులులు ఉన్నాయని వివరించారు. అలాగే వాటిలో 2 పిల్లలు ఉన్నాయని, ఒకటి మాత్రం సరిగా గుర్తించబడలేదని తెలిపారు. పులుల సంరక్షణ కోసం నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు.

## ఉద్యోగాల ఆశ చూపి డబ్బులు దోపిడీ




ఆదిలాబాద్,జూలై 18 (టుడే విదుర): ఆదిలాబాద్ జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని ఆశ కల్పించిన డిజిటల్ మైక్రో ఫైనాన్స్ నిర్వాహకుడు జే.కృష్ణ నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు దండుకున్నాడు. తాను ఆదిలాబాద్, ఉట్నూర్‌లలో మైక్రో ఫైనాన్స్ కార్యాలయాలను ప్రారంభించాడు. ఈ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాడు. వారితో సన్నిహితంగా ఉండేవాడని బాధితులు తెలిపారు. %తాను ఎన్ఆర్ఐని అని చెప్పుకుంటూ.. ప్రజాప్రతినిధులతో సన్నిహితంగా ఉండేవాడు. తాను చేస్తున్న మోసాలపై ఎవరికీ అనుమానం రాకుండా, నిరుద్యోగుల్లో నమ్మకం కల్పించేలా పకడ్బందీగా వ్యవహరించాడు. ఎన్ఆర్ఐని అని చెప్పుకున్న కృష్ణ డబ్బులున్న వ్యక్తిగా సూటు ధరించి, కార్లతో తిరుగుతూ, బౌన్సర్లను పెట్టుకుని పలుకుబడి గల వ్యక్తిగా, ధనవంతుడిగా నటించేవాడు. ఆయనతోపాటు స్థానికంగా ఉంటే కొందరిని తన బృందంలో కలుపుకుని నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టాడు.ఆదిలాబాద్ రిమ్స్‌లో కార్పొరేట్ వైద్యానికి ఉప యోగపడే భారీ పరికరాలను ఉచితంగా అందించినట్లు ప్రజలను నమ్మించాడు. సోషల్ మీడియా ద్వారా తన అనుచరులతో ప్రచారం చేసుకున్నాడు. ఉట్నూర్ ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు నటించి సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. బడా ఫైనాన్స్ సంస్థలతో తనకు పరిచయాలు ఉన్నాయని, డబ్బులు కడితే ఆ కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయని తమను నమ్మించి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశాడని నిరు ద్యోగులు తెలిపారు.

## ఇలా కుక్కి తీసుకెళితే ఎలా?

### ఆటోలు, స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు
### నామమాత్రంగా రవాణా శాఖ తనిఖీలు

హైదరాబాద్, జూలై 18 (టుడే విదుర):నలుగురు వెళ్లాల్సిన ఆటోలో 8 నుంచి 10 మంది.. 8 మందిని తీసుకెళ్లాల్సిన మారుతీ ఓమ్ని వ్యాన్‌లో 15 నుంచి 18 మంది.. మినీ బస్సుల్లో అయితే 30 నుంచి 40 మంది.. విద్యార్థులను కుక్కి మరీ తీసుకెళుతున్నారు. ఆ పిల్లల బ్యాగులు, లంచ్‌బాక్సులు అదనం. ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రతిచోటా కనిపిస్తున్న తంతు. పొద్దున బడులకు వెళ్లేప్పుడు, ఇళ్లకు వచ్చేప్పుడు చిన్నారులకు ఈ ప్రమాదకర ప్రయాణం తప్పడం లేదు. ఏదైనా కారణంతో అనుకోని ప్రమాదం జరిగితే ఎలాగన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ఇలా ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను తరలిస్తున్నా రవాణాశాఖ నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. 'విద్యార్థులను తరలించే వాహనాలపై నిరంతర తనిఖీలు




కొనసాగుతుంటాయి. అధికారులు, సిబ్బంది కొరత కారణంగా నిత్యం, ప్రతి చోటా తనిఖీచేసే వెసులుబాటు ఉండదు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు కూడా కొంత బాధ్యతగా వ్యవహరిస్తే ఈ సమస్యను అరికట్టవచ్చు' అని రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

## ఘోర ప్రమాదం..
## లారీని వెనక నుంచి ఢీకొన్న కారు




రంగారెడ్డి, జూలై 18 (టుడే విదుర):జిల్లాలోని ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇబ్రహీంపట్నం మండలం బొంగులూర్ ఔటర్ రింగ్ రోడ్డుపై లారీని వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్ద అంబర్‌పేట్ నుంచి బోంగులూర్ వైపు వెళుతుండగా ఈరోజు (శుక్రవారం) తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.అలాగే మృతులను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతులు మొయినబాద్ గ్రీన్ వాలీ రిసార్ట్‌లో పనిచేసే వారుగా గుర్తించారు. మలోత్ చందు లాల్(29), గగులోత్ జనార్దన్ (50), కావలి బాలరాజు (40)తో పాటు మరొకరు మృతి చెందారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మోస్తరు వర్షానికే కూలిన మురికి కాల్వ



మోత్కూరు, జూలై 18 (టుడే విదుర): మోత్కూరు మునిసిపాలిటీలో ఇందిరానగర్ కాలనీ ఎదురుగా నార్కట్‌పల్లి రోడ్డు వెంట ఇటీవల కొత్తగా మురికి కాల్వ నిర్మించారు. మధ్యాహ్నం మోత్కూరులో కురిసిన ఓ మోస్తరు వర్షానికి ఆ కాల్వ ఒకవైపు (గోడ)సుమారు 80 మీటర్ల పొడవు కూలిపోయింది. ఒక వైపు (గోడ) కూలి రెండోవైపు ఉన్నదానిపై పడటంతో అదికూడా దెబ్బతిన్నదంటున్నారు. దీంతో మురికి కాల్వ నిర్మాణ నాణ్యతలోని డొల్ల తనం బయట పడినట్టయ్యింది. మురికి కాల్వల నిర్మాణం జరిగేప్పుడు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించడం లేదని, కాంట్రాక్టర్ తగు పాళ్లలో సిమెంటు కలపకుండా ఇష్టారాజ్యంగా నిర్మిస్తూ, క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మురికి కాల్వ నిర్మాణం కోసం కొంత వెడల్పుగా గాతు తీస్తారని, కాల్వ నిర్మాణం జరిగాక కాల్వకు ఇరువైపులా గాతులో ఖాళీ స్థలాన్ని మట్టితో నింపుతారు. గురువారం కురిసిన వర్షానికి మట్టి తడిసి బరువు పెట్టినట్టు కావడంతో మురికి కాల్వ గోడ కూలిందంటున్నారు. ఓ మోస్తరు వర్షానికే ఒక వైపు కూలితే భారీ వర్షాలు కురిస్తే కొత్తగా నిర్మించిన మురికి కాల్వలు ఉంటాయా లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కూలిన మురికి కాల్వకు ఇప్పటికే బిల్లు చెల్లిస్తే కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయాలని, బిల్లు చెల్లించనట్టయితే అతని చేతనే తిరిగి నాణ్యతగా నిర్మింపజేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సిమ్ ఒకరిది.. సోకు ఒకరిది...

వరంగల్ కార్పొరేషన్, జూలై 18 (టుడే విదుర): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఉద్యోగుల సౌకర్యార్థం జారీ చేసిన సిమ్ కార్డులు దుర్వినియోగం అవుతున్నాయా? అంటే ఔననే అనిపిస్తోంది. ఇక్కడ పనిచేసి సంవత్సరం క్రితం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులతో పాటు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాల మునిసిపల్ కార్పొరేషన్లకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులు సైతం నగర పాలక సంస్థ జారీ చేసిన సిమ్ కార్డులు వాడుతున్నారు. కొందరు సిమ్లను వ్యక్తిగత పనుల కోసం వాడుతుండగా.. మరి కొందరు చీకటి పనులకు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. కాగా, దుర్వినియోగం అవుతున్న బల్దియా సిమ్ములపై మేయర్, కమిషనర్ తో పాటు సంబంధిత పరిపాలనా విభాగం, ఐటీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల బల్దియా ఆదాయానికి గండి పడుతోంది. ఫలితంగా నెలకు రూ. 5 లక్షల వరకు అదనంగా ప్రైవేటు సంస్థకు రీచార్జీల పేరుతో చెల్లించాల్సి వస్తుందని ఉద్యోగులు మండిపడుతున్నారు.మొత్తంగా టాక్ టైంతో పాటు అన్ లిమిటెడ్ ఇంటర్నెట్ అందించే ఈ రోజుల్లో బల్దియా సిమ్ కార్డులకు కొందరికి ఒక్కరికి నెలకు రూ.1000, 2500 ఇలా రీచార్జీ చెల్లించడం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## యూరియా కోసం బారులు

హుజూర్‌నగర్,జూలై 18 (టుడే విదుర):హుజూర్‌నగర్ మండలంలో యూరియా కొరత రైతులను నిరాశకు గురిచేస్తోంది. బూరుగడ్డ సహకార పరపతి సంఘం ఎదుట యూరియా కోసం రైతులు తరలివచ్చారు. సంఘానికి 444బస్తాల యూరియా రాగా తెల్లవారుజాము నుండే యూరియా కోసం రైతులు బారులుతీరారు. బస్తా రూ.266లకు విక్రయించారు. బూరుగడ్డ రెవెన్యూ క్లస్టర్ పరిధిలో సుమారు 5వేల ఎకరాలు ఉండగా ఎకరానికి 2 బస్తాల చొప్పున యూరియా అవసరం కాగా కనీసం బస్తా కూడా సర్ఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ పరిధిలో రైతులు యూరియా కోసం తీవ్రఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిలబడితే కొందరికే యూరియా దక్కిందన్నారు. అందని రైతులు నిరాశతో వెనుదిరిగారు. ఇదిలాఉండగా హుజూర్‌నగర్ డివిజన్‌లో సుమారు 260 ఎరువుల దుకాణాలు ఉండగా రూ.400ల నుంచి 500ల వరకు యూరియా బస్తా విక్రయిస్తున్నారు.

## గ్రామాల పేరు మార్పు

బ్రహ్మగిరి (దోమలపెంట), జూలై 18 (టుడే విదుర): శ్రీశైలం పరిసర ప్రాంతంలో ఉన్న కొండలకు పూర్వం బ్రహ్మగిరి, కృష్ణగిరిగా శ్రీశైలం చరిత్రలో ఉన్నపటికీ 1963లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దోమల పెంట, ఈగలపెంట గ్రామాలుగా పిలువబడ్డాయని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. దోమలపెంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం దోమలపెంటను బ్రహ్మగిరి, ఈగలపెంటను కృష్ణగిరిగా ప్రభుత్వం అధికారికంగా మార్పు చేసిందన్నారు. దోమలపెంట, ఈగలపెంట గ్రామాలతో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో



బోర్డులపై పేర్లు మార్పు చేయాలని ఇప్పటికే కలెక్టర్ నుంచి ఆ దేశాలు ఇచ్చినట్లు తెలిపారు. తాను కూడా అన్ని శాఖల అధికారులకు ఆదేశించానన్నారు. బ్రహ్మగిరిలో మహిళా సంఘాల సభ్యులతో స మావేశం అయ్యారు. బ్రహ్మగిరి, కృష్ణగిరి, పా తాళగంగ గ్రామాల్లో ఉన్న మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వపరంగా పెట్రోల్ బంక్, సూపర్ మార్కెట్, జూట్ బ్యాగుల త యారీ, స్వగృహ వంటల తయారీ వంటి అవకాశాలు కల్పించి మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిపించే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. అంతేకాకుండా బ్రహ్మగిరి, కృష్ణగిరి గ్రామాలను పర్యాటకంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శ్రీశైలం డ్యాం నిర్మాణ సమయంలో నిర్మించిన క్వార్టర్సను నిరుపేదలకు క్రమబద్ధీకరిస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసే వారి నుంచి స్థలాలను తిరిగి ఇరిగేషన్ శాఖకు అప్పగిస్తామన్నారు. శ్రీశైలం నుంచి బ్రహ్మగిరి వరకు గతంలో నడిచిన ఆత్మకూర్ డిపో బస్సును తిరిగి పునరుద్ధరించేటట్లు శ్రీశై లం ఎమ్మెల్యేతో మాట్లాడామని, అందుకు వారు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# టుడే వినోదం

## రీమిక్స్ సాంగ్ లేదా..
## అయ్యయ్యో ఎన్నో ఆశలు పెట్టుకున్నామే




మెగాస్టార్ చిరంజీవి , త్రిష జంటగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం విశ్వంభర యూవీ క్రియేషన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమా తరహాలో విశ్వంభర తెరకెక్కుతోందని తెలియడంతో ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడు ఈ సినిమా రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇక ఈ ఏడాది సంక్రాంతికి రిలీజ్ కావాల్సిన సినిమా విఎఫ్ఎక్స్ అవ్వలేదని ఇంకా షూటింగ్ జరుపుకుంటూనే ఉంటుంది. %ఇక ఇదంతా పక్కన పెడితే.. చిరు సినిమాలో ఐటెంసాంగ్ అంటే ఎంత రచ్చ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిరు స్టెప్స్, అందాల భామ అందాలు.. థియేటర్ లో ఆ రెండింటిని చూడడానికి రెండు కళ్లు చాలవు. అందులోనూ ఎప్పటి నుంచోవిశ్వంభర కోసం చిరు సినిమాలోని ఒక సాంగ్ ను రీమిక్స్ చేస్తున్నారని వార్తలు రావడంతో.. మెగా ఫ్యాన్స్ అంచనాలు ఆకాశానికి తాకేశాయి. ఖైదీ నుంచి రగులుతోంది మొగలి పొద రీమిక్స్ అని కొందరు.. అన్నయ్య నుంచి ఆట కావాలా.. పాట కావాలా సాంగ్ రీమిక్స్ అని ఇంకొందరు చెప్పుకొచ్చి.. ఇక ఊరించారు. దీంతో ఫ్యాన్స్ అందరూ.. మాకు ఆ సాంగ్ కావాలి.. ఈ హీరోయిన్ కావాలి అని చెప్పుకొచ్చారు.

## జూనియర్ మూవీ రివ్యూ




ప్రముఖ పారిశ్రామిక వేత్త, రాజకీయ నాయకుడు గాలి జనార్ధనరెడ్డి కొడుకు కిరీటీహీరోగా పరిచయమైన సినిమా 'జూనియర్' . రాధాకృష్ణారెడ్డి దర్శకత్వంలో సాయి కొర్రపాటి సమర్పణలో రజని ఈ సినిమా నిర్మించారు. శ్రీలీల హీరోయిన్ గా, జెనీలియా కీలక పాత్ర పోషించిన ఈ మూవీ జూలై 18న తెలుగు, కన్నడ భాషల్లో విడుదలైంది. మరి ఈ సినిమాకు ఎలాంటి స్పందన లభిస్తుందో చూద్దాం%ా%కథ విషయానికి వస్తే.... చిన్నతనం నుంచే తండ్రి కోదండపాణి (రవిచంద్రన్ అతి ప్రేమ వల్ల తను కోల్పోయిన జ్ఞాపకాలను తిరిగి తెచ్చుకుంటూ లైఫ్ ని ఎంజాయ్ చెయ్యాలని చూసే యువకుడు అభినవ్ (కిరీటి). అందుకోసం ఫ్రెండ్స్ ను కూడా తనే ఎంపిక చేసుకుని వారితో తన మెమొరీస్ ని పంచుకుంటూ ఎంజాయ్ చేస్తుంటాడు. అలా తనకు కాలేజ్ లో తారస పడిన స్ఫూర్తి (శ్రీలీల) ని ఇష్టపడటమే కాదు, ఆమె జాబ్ లో చేరిన చోటే తను కూడా జాబ్ సంపాదిస్తాడు. ఆ కంపెనీకి కాబోయే సీఈఓ విజయ సౌజన్య (జెనీలియా)తో తొలి భేటీలోనే అభి పట్ల ఒక నెగిటివ్ ఇంప్రెషన్ ఏర్పడుతుంది. దాంతో ప్రాధాన్యం లేని పోస్ట్ దక్కించుకున్న అభి అక్కడ తన ఉనికిని ఎలా చాటుకున్నాడు? ఆ తర్వాత అభి, విజయ మధ్య ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి? అసలు అభికి, విజయకి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? చివరికి ఏం జరిగింది? అన్నదే ఈ సినిమా.

## స్టార్ హీరోయిన్స్ కే తప్పలేదు.. నువ్వెంత అనుపమ




ఆడదాని గురించి ప్రతి ఒక్కరు సూక్తులు చెప్తారు కానీ, పాటించరు. తల్లే దైవం అంటారు.. కానీ ఆమెను గౌరవించరు. మహిళలు లేకపోతే అసలు ప్రపంచం ఎక్కడిది అని అంటారు. కానీ, వారినే చిన్నచూపు చూస్తారు. ఇది అనాదిగా జరుగుతూనే ఉంది. ఆడవారు ఎంత బయటకు వచ్చినా.. మగవారితో సమానంగా పనిచేస్తున్నా.. వారిని ఇంకా తక్కువగానే చూస్తున్నారు. ఇది కేవలం బయట మాత్రమే జరగడం లేదు. ఇండస్ట్రీలో కూడా అదే జరుగుతుందని హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ) ఆవేదన వ్యక్తం చేయడం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. %ప్రేమమ్ సినిమాతో తెలుగుతెరకు పరిచయమైన బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. ఉంగరాల జుట్టుతో.. కలువల్లాంటి కళ్లతో మొదటి సినిమాతోనే తెలుగు కుర్రకారుకు అనుపమ తెగ నచ్చేసింది. ఆ తరువాత వరుస సినిమాలలో నటించి మెప్పిస్తూ తెలుగు ఆడపడుచుల మారిపోయింది. గ్లామర్ ఒలకబోయని హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ .. ఒక్కసారిగా టిల్లు స్క్వేర్ లో అందాల ఆరబోత చేసినా కూడా ప్రేక్షకులు ఆదరించారు. ఇక మంచి మంచి కథలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకోవడానికి అనుపమ కష్టపడుతుంది.

## మీ సహనాన్ని పరీక్షించే సినిమా..
## ఓటీటీకి వచ్చేసింది




ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై నెగిటావ్ తెచ్చుకుని హిట్ అయిన చిత్రం హౌస్ ఫుల్ 5. ఇండియాస్ బిగ్గెస్ట్ కామెడీ ఫ్రాంచైజీగా మంచి ప్రేక్షకాదరణ పొందిన హౌస్ ఫుల్ చిత్రాల సిరీస్‌లో గతంలో నాలుగు భాగాలు రిలీజై ఒకదాన్ని మించి మరొకటి విజయం సాధించడమే కాక ప్రేక్షకులకు ఎనలేని కామెడీని అందించాయి. ప్రధానంగా నాలుగో భాగంలోని బాల బాల అనే పాట ప్రపంచ వ్యాప్తంగా ఎనలేని క్రేజ్ తీసుకు వచ్చింది. తాజాగా ఈ సిరీస్‌లో ఐదో భాగంగా వచ్చిన ఈ చిత్రానికి తరుణ్ మన్సుఖాని దర్శకత్వం వహించగా సాజిద్ నడియావాలా నిర్మించారు. జూన్ 6న విడుదలైన ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. %కథ విషయానికి వస్తే.. ఓ బిలియనీర్ తన ఆస్తిని తన వారసులకు ఇవ్వాలని నిర్ణయించుకుంటాడు.




## ఏం సాంగ్ రా బాబు పోవడం లేదు మైండ్ లో నుంచి..




మోనికా.. మై డియర్ మోనికా.. లవ్ యూ మోనికా అంటూ ఒక సాంగ్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ మధ్యకాలంలో ఒకే సాంగ్ హిట్ అయ్యింది అని ఎలా తెలుస్తోంది అంటే.. ఎక్కడ విన్నా.. ఎక్కడ చూసినా ఆ పాటనే వినిపించాలి.. ఆ సినిమా గురించే చర్చించాలి. అందులో డ్యాన్స్ చేసిన హీరోయిన్ గురించే ముచ్చటించాలి. హీరో గురించి తెలియకపోతే అసలు ఇంత బాగా డ్యాన్స్ చేశాడు ఎవర్రా ఈ హీరో అని ఆరాలు తీయాలి. అలా ఉంటేనే ఒక సాంగ్ హిట్ అయ్యిందని అర్ధం. ఇప్పుడు మోనికా సాంగ్ కు ఇవన్నీ జరుగుతున్నాయి. అసలు ఈ సాంగ్ ఏ సినిమాలోది.. ? దాని కథాకమామీషు ఏంటో తెలుసుకుందాం రండి. %సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా కూలీ. ఈ సినిమాలో రజినీతో పాటు అమీర్ ఖాన్, నాగార్జున, సౌబిన్ షాహిర్, సత్యరాజ్, ఉపేంద్ర ఇలా అన్ని ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోస్ నటిస్తున్నారు. పాన్ ఇండియా మొత్తం ఎంతగానో ఎదురుచూస్తున్న సినిమాల్లో కూలీ కూడా ఒకటి.

## స్కామ్ 92 నటుడి..
## కొత్త స్పై థ్రిల్లర్ రిలీజ్ డేట్ వచ్చేసింది




ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు ఓ వినూత్న సిరీస్ కొత్త స్పై థ్రిల్లర్ సారే జహాన్ సె అచ్చా రెడీ అయింది. స్కామ్ 1992 సిరీస్‌తో దేశ వ్యాప్తంగా విపరీతమైన గుర్తింపును తెచ్చుకున్న ప్రతీక్ గాంధీ ఇందులో లీడ్ రోల్‌లో నటించాడు. తిలోత్తమ, సన్నీ హిందుజా కృతిక కమ్రా, రజత్ కపూర్ కునాల్ ఠాకూర్, అనూప్ సింగ్ కీలక పాత్రల్లో నటించారు. గౌరవ్ శుక్లా దర్శకత్వం వహించాడు.

# బుమ్రా ఆడాల్సిందే




లార్డ్స్ టెస్టు పరాజయం ఆటగాళ్లతో పాటు అభిమానులను కూడా తీవ్ర వేదనకు గురిచేసింది. ఎన్నడూ గెలవని బర్మింగ్‌హామ్‌లో విజయకేతనం ఎగురవేసిన తర్వాతి మ్యాచ్‌లోనే ఈ పరాజయం ఎదురైంది. దీంతో ఇప్పుడు ఐదు టెస్టుల సిరీస్ అత్యంత ఆసక్తిరంగా మారింది. ఈనెల 23 నుంచి ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగే నాలుగో టెస్టు గెలిస్తేనే భారత్ ఆశలు సజీవంగా ఉంటాయి. గురువారం నుంచి గిల్ సేన తమ సన్నాహకాలను కూడా ఆరంభించింది. అయితే తమ ప్రధాన ఆయుధం పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఈ మ్యాచ్‌లో బరిలోకి దించుతారా? లేదా? అనే సందేహం అందరిలో నెలకొంది. బుమ్రా ఈ సిరీసలో మొదటి, మూడో టెస్టులో మాత్రమే ఆడాడు. ఈ రెండింట్లో కలిపి12 వికెట్లు తీశాడు. అయితే పనిఒత్తిడిలో భాగంగా కేవలం మూడు టెస్టులకు మాత్రమే అందుబాటులో ఉంటాడని ఈ పర్యటనకు ముందే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. దీంతో చివరిదైన ఐదో టెస్టులో మాత్రమే బుమ్రాను ఆడిస్తారంటూ కథనాలు వెలువడుతున్నాయి. కానీ తాజాగా జట్టు పరిస్థితిని గమనిస్తే ఇబ్బందికరంగా ఉంది. లార్డ్స్ ఓటమి గిల్ సేనను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. ప్రస్తుతం 1-2తో వెనుకబడిన దశలో మాంచెస్టర్ టెస్టును కోల్పోతే సిరీస్ పోయినట్టే. ¬

# ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్.. నాలుగో టెస్టులో అతడికి చోటిస్తే భారత్‌కు విజయం



%ఇంటర్నెట్ డెస్క్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత్ వెనుకబడింది. మాంచెస్టర్ వేదికగా జరిగే నాలుగో టెస్టులో గెలిస్తేనే సిరీస్ సొంతమయ్యేది. ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గంభీర్‌పై తీవ్ర ఒత్తిడి ఉందని అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అయితే, నాలుగో టెస్టులో విజయం సాధించేందుకు కుల్దీప్ యాదవ్‌ను రంగంలోకి దించాలని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ సూచించాడు. టీమిండియా స్క్వాడ్‌లో భాగమైనప్పటికీ కుల్దీప్‌కు ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఇంకా చోటు దక్కలేదు. ఇప్పటివరకూ అతడు ఇంగ్లండ్‌పై ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో కుల్దీప్‌ను రంగంలోకి దించాలని క్లార్క్ సూచించాడు. 'ఇండియా అద్భుతంగా ఆడింది. ముఖ్యంగా జడేజా ప్రదర్శన అద్భుతం. అయితే నేనొక విషయం బహిరంగంగా చెప్పదలుచుకున్నాను. ప్లేయింగ్ ఎలెవెన్‌లో కుల్దీప్‌కు చోటివ్వాలి. అతడిని రంగంలోకి దించండి. ఎలాగోలా ఈ పని చేయండి"వాస్తవానికి వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అవసరమైనప్పుడు రన్స్ కూడా స్కోర్ చేశాడు. ఇక జడేజా పర్ఫార్మెన్స్ అద్భుతం. ఎన్నో సందర్భాల్లో జట్టుకు అండగా నిలిచాడు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, మూడో టెస్టులో అతడికి మరో ఎండ్‌లో మద్దతుగా ఎవరైనా ఉంటే బాగుండేది. అతడికీ ఇదే అనిపించి ఉంటుంది' అని అన్నాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో భారత్ 22 పరుగుల స్వల్ప తేడాతో ఓటమి చవి చూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో క్లార్క్ సూచనను గిల్, గంభీర్ స్వీకరిస్తారో లేదో తెలియాల్సి ఉంది.

# పెయింటర్‌గానే ఎక్కువ సంపాదన



లండన్: దాదాపు మూడు దశాబ్ధాల క్రితమే క్రికెట్‌కు వీడ్కోలు చెప్పిన ఇంగ్లండ్ మాజీ వికెట్ కీపర్ జాక్ రస్సెల్ ఇప్పుడు కాన్వాస్ పెయింటర్‌గా స్థిరపడ్డాడు. 1988-1998 మధ్య తను 54 టెస్టులు, 40 వన్డేలు ఆడాడు. కళ్లకు నల్లటి గ్లాసులు, తలకు పనామా టోపీ, పొడవాటి మీసాలతో విలక్షణంగా కనిపించే రస్సెల్ 90 దశకంలో క్రికెట్ ఫ్యాన్స్‌ను అమితంగా ఆకట్టుకునేవాడు. క్రికెట్ నుంచి వైదొలిగాక పెయింటింగ్‌లో బిజీ అయ్యానని చెప్పాడు. అంతేకాకుండా క్రికెట్ ఆడే సమయంలోకన్నా ఇప్పుడే ఎక్కువగా సంపాదిస్తున్నట్టు రస్సెల్ తెలిపాడు. అయితే ధన సంపాదన కోసమే పెయింటింగ్స్ వేయడం లేదని, బొమ్మలు గీయడం తనకో వ్యసనమని తేల్చాడు. భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్నందున తాను రంజిత్ సింగ్‌జీ బొమ్మను సైతం చిత్రించినట్టు పేర్కొన్నాడు.

# క్రికెట్‌కు రస్సెల్ గుడ్‌బై



కింగ్‌స్టన్: వెస్టిండీస్ పవర్ హిట్టింగ్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్(37) తన 15 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. ఈ నెల 22న సొంత మైదానం సబీనా పార్క్‌లో ఆస్ట్రేలియాతో రెండో టీ20.. రస్సెల్ కెరీర్‌కు చివరిది కానుంది. పొట్టి క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్న రస్సెల్ 2012, 2016 టీ20 వరల్డ్‌కపలు నెగ్గిన వెస్టిండీస్ జట్లలో సభ్యుడిగా ఉన్నాడు. 2019 నుంచి రస్సెల్ కేవలం టీ20ల్లో మాత్రమే కనిపిస్తున్నాడు. ఫ్రీలాన్సర్‌గా ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. 84 టీ20లు, 56 వన్డేలు, ఒక్క టెస్ట్‌లో విండీసకు ప్రాతినిథ్యం వహించాడు. ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీసకు రస్సెల్ ఎంపియ్యాడు. కానీ, ఈ నెల 20, 22న జరిగే తొలి రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాలని నిర్ణయించుకొన్నాడు.

# ఈతకొలనులో చైనా చిన్నారి ప్రకంపనలు



సింగపూర్: యు జిడీ..చైనాకు చెందిన ఈ బాలికకు 12 సంవత్సరాలు. కానీ స్విమ్మింగ్ ప్రపంచం మొత్తం ఈమెవైపు ఆసక్తిగా చూస్తోంది. కారణం..ప్రస్తుతం సింగపూర్‌లో జరుగుతున్న వరల్డ్ అక్వాటిక్ చాంపియన్‌షిపలో ఆ చిన్నారి ఎన్ని ప్రకంపనలు సృష్టిస్తుందోనని! ఈ పోటీల్లో మహిళల 200 మీ, 400 మీ. వ్యక్తిగత మెడ్లేతోపాటు, 200 మీ. బటర్‌ఫ్లై ఈవెంట్లలో యు బరిలోకి దిగుతోంది. ఈ మూడింటిలో యు జిడీకి స్వర్ణాలు ఖాయమని స్విమ్మింగ్ విశ్లేషకులు బల్లగుద్ది చెబుతున్నారు. ఇప్పటి వరకు ఈ మూడు విభాగాల్లో ఆమె నమోదు చేసిన సమయాలను చూస్తే ఈ చైనీస్ వండర్ సింగపూర్‌లో పసిడి మోత మోగిస్తుందని అంటున్నారు.

# జపాన్ ఓపెన్ మన కథ ముగిసెన్



టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ కథ ముగిసింది. బరిలో మిగిలిన సాత్విక్ జోడీ, లక్ష్యసేన్ కూడా రెండో రౌండ్‌లో పరాజయంతో ఇంటిబాట పట్టారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 19-21, 11-21తో కొడాయ్ (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ఇక సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ 22-24, 14-21తో చైనా జంట లియాంగ్ వీ కెంగ్/వాంగ్ చాంగ్ చేతిలో ఓటమి చవి చూసింది. అనుపమా ఉపాధ్యాయ 21-13, 11-21, 12-21తో వాంగ్ ఝీ హీ (చైనా) చేతిలో పోరాడి ఓడింది.

# స్విమ్మింగ్‌లో రోహిత్ జాతీయ రికార్డు



న్యూఢిల్లీ: భారత టీనేజ్ స్విమ్మర్ రోహిత్ బెనెడిక్టన్ జర్మనీలో జరుగుతున్న ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడల్లో జాతీయ రికార్డును తిరగ రాశాడు. గురువారం జరిగిన పురుషుల 50 మీ. బటర్‌ఫ్లైలో 24 సెకన్లలో గమ్యం చేరిన రోహిత్..వీర్‌ధవల్ ఖడే పేరిట ఏడేళ్ల నుంచి ఉన్న రికార్డు (24.09సె.) బద్దలుగొట్టాడు. ఓవరాల్‌గా 12వ స్థానంలో నిలిచిన రోహిత్ సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ 5-0తో మకావును చిత్తు చేసింది.

# అప్పుడే ఎంత ఎదిగావు తల్లీ



న్యూఢిల్లీ: కూతురు ఐరా 10వ పుట్టిన రోజును పురస్కరించుకొని టీమిండియా పేసర్ మహ్మద్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. షమి-హసీన్ జంట మనస్పర్థల ల కారణంగా 2018లో విడిపోయినప్పటినుంచి ఐరా తల్లి వద్ద ఉంటోంది. 'నువ్వు ఇంత త్వరగా ఎదిగావంటే నమ్మలేకపోతున్నా. జీవితంలో నీకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నా. భగవంతుడు నీకు ప్రేమ, ఆనందం, ఆరోగ్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా' అంటూ ఐరాతో కలిసి ఉన్న ఫొటోలను పంచుకున్నాడు.

# టుడే బిజినెస్

# బంగారం కొనాలనుకునేవారికి షాక్..

## మళ్లీ పెరిగిన ధరలు..




వేల ఏళ్ల నుంచి వన్నె తగ్గని, ఫేడ్ అవుట్ అవ్వని ఖనిజం ఏదైనా ఉంది అంటే అది కచ్చితంగా బంగారమే అని చెప్పాలి. రోజు రోజుకు బంగారం డిమాండ్ పెరుగుతూ పోతోందే తప్ప తగ్గటం లేదు. జనం బంగారాన్ని ఒంటిమీద నగలాగా మాత్రమే కాకుండా భవిష్యత్ పెట్టుబడిగా కూడా భావిస్తున్నారు. అందుకే ప్రపంచం నలుమూలలా ఉన్న జనం బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారు. ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర లక్ష దగ్గర ట్రేడ్ అవుతోంది.భాగ్య నగరంలో నిన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 99,330 రూపాయల దగ్గర..10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,050 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,500 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 99,340 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,060 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,510 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

# విప్రో లాభం రూ.3,336 కోట్లు

## రూ.22,135 కోట్లకు పెరిగిన ఆదాయం

## ఒక్కో షేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్




న్యూఢిల్లీ: దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ కంపెనీ విప్రో ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 9.8 శాతం వృద్ధితో రూ.3,336.5 కోట్లకు పెరిగింది. కొత్త కాంట్రాక్టులు భారీగా దక్కడం ఇందుకు దోహదపడింది. క్యూ1లో సంస్థ ఆదాయం కూడా వార్షిక ప్రాతిపదికన స్వల్ప పెరుగుదలతో రూ.22,134.6 కోట్లకు చేరుకుంది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే మాత్రం విప్రో లాభం 7 శాతం, ఆదాయం 1.6 శాతం తగ్గాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు అర్హులైన షేర్‌హోల్డర్లను ఈ నెల 28న రికార్డు చేయనున్న కంపెనీ.. ఆగస్టు 15న డివిడెండ్ చెల్లింపులు చేపట్టనున్నట్లు తెలిపింది. మరిన్ని వివరాలు..


# వేతన జీవులకు అక్కరకొచ్చే 50-30-20 ఫార్ములా



ఇంటర్నెట్ డెస్క్: కొందరికి అవసరాలకు సరిపడా డబ్బు ఉండదు. మరి కొందరికీ ఖర్చు విషయంలో అదుపు ఉండదు. దీంతో ఎంత సంపాదించినా నెలాఖరుకు రిక్త హస్తాలే మిగులుతాయి. అయితే, ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు పర్సనల్ ఫైనాన్స్ నిపుణులు ఓ ముఖ్య సూచన చేస్తున్నారు. ఈ సూచనను యథాతథంగా ఫాలో అయితే లైఫ్‌లో నిశ్చితంగా ఉండొచ్చుట. మరి వారు చెబుతున్నా 50–30–20 ఫార్ములా ఏంటో ఈ కథనంలో కూలంకషంగా తెలుసుకుందాం.నిపుణులు చెప్పేదాని ప్రకారం, నెల నెలా వచ్చే జీతాన్ని మూడు భాగాలుగా విడగొట్టాలి. ఒకటి అవసరాల కోసం, రెండోది మనసుకు నచ్చిన ఖర్చుల కోసం, మూడో భాగాన్ని పోదుపు కోసం కేటాయించాలి. అవసరాల కోసం శాలరీలో 50 శాతాన్ని కేటాయించాలి. ఇక ఇష్టాయిష్టాలు తీర్చుకునేందుకు మరో 30 శాతం ఖర్చు పెట్టొచ్చు. చివరిగా మిగిలిన 20 శాతాన్ని మాత్రం ఖచ్చితంగా భవిష్యత్ అవసరాల కోసం పొదుపు చేయాలి. ఈ స్మార్ట్ ప్లాన్‌ను ఎలాంటి మినహాయింపులు లేకుండా అమలు చేస్తే జీవిత చరమాంకంలో ఇబ్బందీ ఉండదు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా అనేక మంది ఈ ఫార్ములాతో ఇప్పటికే లాభపడ్డారు కూడా.

# హురున్ యువ పారిశ్రామికవేత్తల్లో

## శశాంక్ గుజ్జుల, అనుపమ్ పెదరాల




న్యూఢిల్లీ: దేశంలో 30 ఏళ్లలోపు యువ పారిశ్రామికవేత్తల జాబితాలో క్విక్ కామర్స్ స్టార్టప్ జెప్టో సహ వ్యవస్థాపకులైన అదిత్ పలిచ, కైవల్య వోహ్రా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. మొత్తం 79 మంది యంగ్ ఆంత్రప్రెన్యూర్ల వివరాలతో కూడిన ఈ జాబితాను అవెండస్ వెల్త్, హురున్ ఇండియా సంయుక్తంగా గురువారం విడుదల చేశాయి. హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుటెక్ స్టార్టప్ నెక్ట్స్‌వేవ్ సహ వ్యవస్థాపకులు శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదరాలకు కూడా ఈ లిస్ట్‌లో స్థానం లభించింది. మిర్యాలగూడకు చెందిన 28 ఏళ్ల శశాంక్ గుజ్జుల, ఏలూరు జిల్లా పెదరాయి గ్రామానికి చెందిన 30 ఏళ్ల అనుపమ్ పెదరాల వరుసగా 29, 30 స్థానాల్లో ఉన్నారు. కాలేజీ విద్యార్థులకు ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో వీరు 2020లో నెక్ట్స్‌వేవ్‌ను ప్రారంభించారు. కాగా, రిలయన్స్ ఇండస్ట్రీసకు చెందిన అనంత్ అంబానీ, రాధిక అంబానీతో పాటు అదానీ గ్రూప్‌నకు చెందిన సాగర్ అదానీ సహా పలువురు రెండో తరం పారిశ్రామికవేత్తలకు సైతం ఈ జాబితాలో చోటు లభించింది.

# హెరిటేజ్ ఫుడ్స్ ఆదాయం రూ.,137 కోట్లు

హైదరాబాద్ హెరిటేజ్ ఫుడ్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,136.80 కోట్ల ఆదాయంపై రూ.40.54 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.1,032.67 కోట్లు)తో పోల్చితే ఆదాయం 10 శాతం వృద్ధి చెందగా లాభం మాత్రం 31 శాతం (రూ.58.42 కోట్లు) తగ్గింది. ఏప్రిల్– మే నెలల్లో అకాల వర్షాల కారణంగా అన్ని మార్కెట్లలో పెరుగు, బటర్‌మిల్క్, ఫ్లేవర్డ్ మిల్క్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ తగ్గటం పనితీరు ప్రభావం చూపించిందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. అయితే జూన్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనటం కొంతమేరకు కలిసివచ్చిందని పేర్కొంది. కాగా జూన్ త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూలు తొలిసారిగా రూ.1,100 కోట్ల మార్కును అధిగమించాయని తెలిపింది.

మరోవైపు ఈ కాలంలో వ్యయాలు కూడా రూ.958.90 కోట్ల నుంచి రూ.1,085.76 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికంలో వ్యాపారపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ కంపెనీ తొలిసారిగా రూ.1,100 కోట్ల రెవెన్యూ మార్కును అధిగమించిందని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు. కంపెనీ వ్యాపార ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉన్నాయని, దీర్ఘకాలంలో మరింత వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఐస్‌క్రీమ్ ప్లాంట్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. హెరిటేజ్ నోవాండెల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్ఎన్ఎఫ్‌పీఎల్)లో అదనంగా 44.4 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు బోర్డు ఆమోదం లభించిందని హెరిటేజ్ ఫుడ్స్ పేర్కొంది. ఈ కొనుగోలుతో హెచ్ఎన్ఎఫపీఎల్‌లో కంపెనీ మొత్తం వాటా 94.4 శాతానికి చేరనుంది.

# స్పీచ్‌ను టెక్ట్స్‌గా మార్చే ఎల్ఎల్ఎం




బెంగళూరు: కృత్రిమ మేధ (ఏఐ) ఆ?ధారిత లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) ఆవిష్కరణలో దేశీయ కంపెనీలూ తమ సత్తా చూపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్) పద్ధతిలో కంపెనీలకు సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు అందించే దేశీయ టెక్నాలజీ కంపెనీ జోహో 'జియా ఎల్ఎల్ఎం' పేరుతో తన సొంత ఎల్ఎల్ఎంను ఆవిష్కరించింది. తమ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను ఉ

# యాక్సిస్ బ్యాంక్‌కు మొండిబాకీల సెగ




న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4 శాతం తగ్గి రూ.5,806 కోట్లకు పరిమితమైంది. మొండి బకాయిలు (ఎన్‌పీఏ) స్వల్పంగా పెరగడం ఇందుకు కారణమైంది. సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం మాత్రం రూ.38,322 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.31,064 కోట్లుగా నమోదైంది. గత ఏడాది జూన్ 30 నాటికి 1.54 శాతంగా ఉన్న స్థూల ఎన్‌పీఏలు ఈ జూన్ చివరి నాటికి 1.57 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు 0.34 శాతం నుంచి 0.45 శాతానికి ఎగబాకాయి. ఈ కాలంలో బ్యాంక్ మొండిబకాయిలతో పాటు ఇతర అవసరాలకు

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006